జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 179 15-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06




## హార్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్

- హార్మూజ్ జలసంధిలో కార్గోపై 20 శాతం సుంకం ప్రతిపాదనను ఉపసంహరించుకున్న ట్రంప్
- సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకుంటామని వెల్లడి
- ఈ ఒప్పందాల వల్ల అమెరికాలో లక్షల ఉద్యోగాలు వస్తాయని ట్రంప్ ప్రకటన
- ఒక్కరోజు ముందే హార్మూజ్ భద్రతకు తాము డబ్బు వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటన
- ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న పరిణామం



## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ

ఉక్రెయిన్‌పై అణుదాడిని ప్రధాని మోదీ నివారించారన్న పోలండ్ మంత్రి

రష్యాతో భారత్‌కు ఉన్న సంబంధాలే ఇందుకు కారణమని వ్యాఖ్య

మోదీ చెప్పే మాటలను పుతిన్ శ్రద్ధగా వింటారని వ్యాఖ్య

2022 చివర్లో అణుయుద్ధ భయాలు పెరిగిన వేళ ఈ పరిణామం

ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో అణ్వస్త్రాల ప్రయోగం జరగకుండా నివారించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోస్జెస్కీ ప్రశంసించారు. 2022 చివరి నాటికి ఉక్రెయిన్‌పై అణుదాడికి రష్యా సిద్ధమవుతోందన్న ఆందోళనలు వ్యక్తమైన తరుణంలో, ప్రధాని మోదీ జోక్యం చేసుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఒప్పించగలిగారని ఆయన వెల్లడించారు.

- మిగతా 2వ పేజీలో



## అసలు సమస్యే రాకుండా చూసేవాడు
# అద్భుతమైన అధికారి

మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమావేశం

సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత అన్న చంద్రబాబు

అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లాలి.. నాలుగు గోడలకే పరిమితం కావొద్దని సూచన

ఇకపై నెలవారీ ఆర్థిక నివేదికల (వీజు=) ఆధారంగా సమీక్ష ఉంటుందని స్పష్టీకరణ



"సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించేవాడు మంచి అధికారి అయితే, అసలు సమస్యే తలెత్తకుండా ముందుచూపుతో పనిచేసేవాడు అద్భుతమైన అధికారి. ఆ కోణంలో అధికారులు పనిచేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నాలుగు గోడలు దాటి ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లగలమని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం మాట్లాడారు. డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ ఫలితాలు సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికోసం దేశంలోనే మొదటిసారిగా

- మిగతా 2వ పేజీలో



## అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి

2028 జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తిచేయాలి

కాకతీయ సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలి

హుస్సేన్‌సాగర్ నుంచి ప్రకాశం బరాజ్ వరకూ సీప్లేన్‌లు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి సీఎం రేవంత్‌రెడ్డి వినతి

అత్యుత్తమ కల్చరల్ టెర్మినల్‌గా వరంగల్: రామ్మోహన్‌నాయుడు

కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందన్న రేవంత్

న్యూఢిల్లీ: వ్యూహాత్మక, వాణిజ్యపరమైన అవసరాల రీత్యా వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలోని విమానయాన శాఖ కార్యాలయమైన రాజీవ్‌గాంధీ భవన్‌లో రామ్మోహన్ నాయుడితో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. వరంగల్ విమానాశ్రయ పనుల గురించి చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతోపాటు

- మిగతా 2వ పేజీలో

## అమెజాన్ డేటా సెంటర్‌కు నేడు సీఎం శంకుస్థాపన

భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు.. 24 నెలల్లో పూర్తికానున్న నిర్మాణ పనులు

రాష్ట్రంలో డేటా సెంటర్ల విస్తరణకు రూ.60 వేల కోట్లు వెచ్చించనున్న సంస్థ



2లో



## కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచిన నేత

కాపు ఉద్యమ నేతగా రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర

2లో



## పీవోకేలో పాక్ దమనకాండ..

ఆరుగురు మృతి, భారత్ తీవ్ర విమర్శ

పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీఓకే ప్రజల ఆందోళన

పాక్ పోలీసులు, రేంజర్ల కాల్పుల్లో ఆరుగురు మృతి

తమ ప్రాణాలు కాపాడాలని భారత్ కు పీవోకే ప్రజల విన్నపం



## మత్స్యకారులను బలిగొన్నది ప్రభుత్వ నిర్లక్ష్యమే

- కేవలం 10 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం
- ఇక్కడే కోస్ట్ గార్డులు, నేవీ, కలెక్టర్, కమిషనర్.. అందరున్నా ఎవరూ పట్టించుకోలేదు
- 20 గంటలపాటు పోరాటం చేసినా ఎవరూ పట్టించుకోక పోవడంతోనే దారుణం
- చేసిన తప్పును కప్పిపుచ్చుకునేలా త్రిసభ్య కమిటీ నివేదిక
- 5వ తేదీ ఉదయం 5 గంటల వరకు ఈ ఘటన గురించి తెలియదని బుకాయింపు
- వాస్తవానికి ఈ ఘటనపై 4వ తేదీ రాత్రి 10.30 గంటలకే వాట్సాప్ మెసేజ్‌లు
- ఒక్క మంత్రి కూడా బాధిత కుటుంబాల వైపు కన్నెత్తి చూడలేదు
- సంబంధిత మంత్రి అచ్చెన్నాయుడు, విపత్తులు, హోం మంత్రి అనిత పట్టించుకోలేదు
- బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి

విశాఖపట్నం: బోటు ప్రమాద ఘటనలో ప్రుభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. జూలై 4వ తేదీ మధ్యాహ్నం ప్రమాదం జరిగితే.. రాత్రి 7 గంటలకే సమాచారం అందించినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా 5వ తేదీ ఉదయం 5 గంటల వరకు తమకు సమాచారం లేదంటూ త్రిసభ్య కమిటీ నివేదికలో పేర్కొనడం ద్వారా చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం మరో తప్పు చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రమాదానికి గురైన మత్స్యకార

- మిగతా 2వ పేజీలో

## రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?

- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వైసీపీ ఇప్పుడు సమీక్షల పేరుతో డ్రామా ఆడుతోందని సోమిరెడ్డి విమర్శ
- టీడీపీ 24 నెలల్లో రూ. 12,484 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ఐదేళ్లలో చేసిందేమీ లేదని ఆరోపణ
- ఎన్జీటీ ఇచ్చిన స్టేను నాలుగేళ్ల పాటు ఎందుకు ఎత్తించలేకపోయారని జగన్‌కు సూటిగా ప్రశ్న
- రాయలసీమ ప్రాజెక్టుల చరిత్ర, ఖర్చులపై వైసీపీతో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్



2లో

## ఈసారి రూ.90 కోట్లు

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ అరెస్ట్
- రవీందర్‌తోపాటు బంధువులు, బినామీల ఇళ్లపై ఏసీబీ దాడులు
- భారీగా ప్లాట్లు, ఫ్లాట్లు, బంగారం, నగదు గుర్తించిన అధికారులు
- బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ.90 కోట్లు ఉంటుందని అంచనా
- దాడులతో ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాల్లో కలకలం



2లో

## కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరపున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు.

## పీవోకేలో పాక్ దమనకాండ..

పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆందోళన చేస్తున్న నిరసనకారులపై పాక్ పోలీసులు, రేంజర్లు కాల్పులు జరపడంతో ఆరుగురు మృతి చెందారు. పదుల సంఖ్యలో ఆందోళనకారులు గాయపడ్డారు. కొంతకాలంగా పీవోకేలో ఇంటర్నెట్ నిలిపివేయడంతో దాదాపు 40 లక్షల మంది ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని నిరసనకారులు తెలిపారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పీవోకే ప్రజలు వాపోతున్నారు. తమ ప్రాణాలను కాపాడాలని, మానవతా సాయం అందించాలని భారత్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. పూంఛ్, దోడా సెక్టార్లలో నియంత్రణ రేఖను తెరవాలని కోరారు.  పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలపై పాక్ అణచివేత ధోరణిని భారత్ తీవ్రంగా విమర్శించింది. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న వ్యవస్థాగత దోపిడీ, బలవంతపు ఆక్రమణలు, అణచివేత వల్లే ఈ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఆహారం, మందుల సరఫరా నిలిపివేత, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్, తీవ్ర హింస పాక్ క్రూరత్వానికి నిదర్శనమని విమర్శించారు.  అటు, అమెరికాలో స్థిరపడిన పీవోకే పౌరులు వైట్‌హౌస్ ముందు నిరసన చేపట్టారు. ఈ ఘటనలు పాక్ ఆక్రమణకు వ్యతిరేకంగా పీవోకేలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి.

## హార్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హార్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో విశేష గౌరవం పొందిన గొప్ప రాజనీతిజ్ఞుడు. భారత్‌కు రష్యాతో చారిత్రక, సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. అందుకే మోదీ మాటలను పుతిన్ అత్యంత శ్రద్ధతో వింటారు" అని పేర్కొన్నారు. రష్యాపై ప్రభావం చూపగలిగే అతికొద్ది మంది ప్రపంచ నేతల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు మోదీ కూడా ఒకరని బార్టోస్జెస్కీ వివరించారు. 2022 ద్వితీయార్ధంలో ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చినప్పుడు, రష్యా అణ్వస్త్రాలను ప్రయోగించవచ్చన్న భయాందోళనలు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నాయి. అయితే అప్పట్లో పెను ప్రమాదం తప్పడం వెనుక మోదీ దౌత్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మొదట్లో రష్యా నుంచి భారత్ రాయితీపై చమురు కొనుగోలు చేయడాన్ని పోలండ్ విమర్శించినప్పటికీ, ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయని, ఒకరి ఆర్థిక, వ్యూహాత్మక అవసరాలను మరొకరు గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో భారత్ మొదటి నుంచి తటస్థ వైఖరిని అనుసరిస్తోంది. కేవలం దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. అటు రష్యాతో ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూనే, ఇటు శాంతి స్థాపన కోసం పిలుపునిస్తోంది.

## రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ఇప్పుడు కొత్త డ్రామాకు తెరలేపిందని, ఐదేళ్ల పాలనలో వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు సమీక్షల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులపై తాము చేసిన ఖర్చు, వైసీపీ హయాంలో జరిగిన నిర్లక్ష్యంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈరోజు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఆర్‌ఎల్ఐఎస్) పనులపై స్టే ఇచ్చిందని సోమిరెడ్డి గుర్తుచేశారు. "అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ అల్లుడు, మంత్రి హరీశ్ రావు తామే 18 లేఖలు రాసి, కేసులు వేసి ఆర్‌ఎల్ఐఎస్ పనులను ఆపించామని ఆనాడు 'నమస్తే తెలంగాణ' పత్రికలో గొప్పగా చెప్పుకున్నారు. మరి, కేసీఆర్‌తో స్నేహంగా ఉన్న జగన్.. ఆ స్టేను నాలుగేళ్ల పాటు ఎందుకు ఎత్తివేయించలేకపోయారు.

# అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

(మొదటి పేజీ తరువాయి)

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తదితర పరిశ్రమలతో తెలంగాణలో వరంగల్ కీలక నగరంగా ఉందని వివరించారు. ఉత్తర తెలంగాణలోని జిల్లాలకు కేంద్రంగా ఉన్న వరంగల్‌ను పారిశ్రామికంగా మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అందువల్ల వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ సదుపాయాలను కల్పించాలని కోరారు. ఇప్పటికే భూసేకరణ పూర్తి అయినందున, టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, వరంగల్‌కు ఉన్న ఘనమైన కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు సీఎం ఈ సందర్భంగా ప్రస్తావించగా, రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తంచేశారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో పౌర విమానాశ్రయం నిర్మించాలని రామ్మోహన నాయుడుకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వరంగల్ విమానాశ్రయం మాదిరిగానే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలను నెలకొల్పాలని విన్నవించారు. హుస్సేన్‌సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం బరాజ్ వరకూ సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలన్నారు. దీనికి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందిస్తూ, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, విమానయాన శాఖ కార్యదర్శి సమీర్‌కుమార్ శర్మ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ విపిన్ కుమార్ పాల్గొన్నారు.

### చరిత్రకు అద్దంపట్టేలా డిజైన్: రామ్మోహన్‌నాయుడు

విమానాశ్రయ నిర్మాణానికి సకాలంలో భూసేకరణ పూర్తిచేసి తెలంగాణ ప్రభుత్వం ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. భూసేకరణ, ఇతర అంశాల్లో మిగతా రాష్ట్రాలు కూడా తెలంగాణ మాదిరే స్పందించాలని చెప్పారు. కాకతీయ సంస్కృతి, వారసత్వానికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయ డిజైన్ ఉంటుందన్నారు. దేశంలోనే అత్యుత్తమ కల్చరల్ టెర్మినల్‌గా నిలుస్తుందన్నారు. అలాగే, రక్షణ శాఖతో సంయుక్తంగా సివిలియన్, డిఫెన్స్ అవసరాల కోసం స్ట్రాటజిక్ లొకేషన్‌గా ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని నిర్మిస్తామని వివరించారు. ఇందుకోసం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిషన్‌రెడ్డితో కలిసి సమీక్షించినట్లు వెల్లడించారు.

## అమెజాన్ డేటా సెంటర్‌కు నేడు సీఎం శంకుస్థాపన

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ నూతన డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ కేంద్రంగా సర్వే నంబర్ 120లో 48 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తాజాగా అదే ప్రాంతంలో సేవలను విస్తరించనుంది. బుధవారం మధ్యాహ్నం 12:15 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీకి చేరుకొని అమెజాన్ నూతన డేటా సెంటర్ భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ డేటా సెంటర్ నిర్మాణ పనులు 24 నెలల్లో పూర్తి కానున్నాయి. 2025 జనవరిలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు సందర్భంగా అమెజాన్ ప్రతినిధులతో చర్చించిన సీఎం రేవంత్.. తెలంగాణలో డేటా సెంటర్ల విస్తరణ కోసం రూ. 60 వేల కోట్ల పెట్టుబడికి అమెజాన్ బృందాన్ని సూత్రప్రాయంగా ఒప్పించారు.

## మత్స్యకారులను బలిగొన్నది ప్రభుత్వ నిర్లక్ష్యమే

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలను సీఎంకానీ, సంబంధిత మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు కానీ పరామర్శించలేదని ఎత్తి చూపారు. బాధిత ఏడు కుటుంబాలకు ఒక్కొక్కరికి వెంటనే రూ.కోటి నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన బోటు స్థానంలో కొత్త బోటు కొనివ్వాలని, ప్రభుత్వం స్పందించకపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోగా ఒక్కో కుటుంబానికి రూ.1కోటి చొప్పున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.  విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి గంగవరం పోర్టుకు కేవలం 10 నాటికల్ మైళ్ల దూరంలో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన ఆరుగురి కుటుంబాలతోపాటు, ప్రమాదం నుంచి బయటపడ్డ చిన్నా కుటుంబాన్ని వైఎస్ జగన్ మంగళవారం పరామర్శించారు. ఆ కుటుంబాలకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం విశాఖలోని జబ్బర్‌తోట జంక్షన్ వద్ద మీడియాతో మాటా?లడారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

### అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రభుత్వం ఎంత అన్యాయంగా, మానవత్వం లేకుండా ప్రవర్తించిందనే దానికి బోటు ప్రమాదం ఘటన అద్దం పడుతోంది. జూలై 1న చిన్నాతో పాటు మరో ఆరుగురు.. మొత్తం ఏడుగురు వేటకు బయలుదేరారు. జూలై 4న అంటే మూడు రోజుల తర్వాత చిన్న.. తన ఫోన్ నుంచి తన మేనల్లుడు గురునాథ్‌కు 2.31 గంటలకు (కాల్ డేటా చూపిస్తూ) ఫోన్ చేసి మరో గంటలో ఇంటికి వస్తున్నాం.. అని చెప్పాడు. దురదృష్టవశాత్తు ఫోన్ చేసిన గంటకే తీవ్రమైన అలలతో బోటు మునిగింది. వీళ్లంతా కూడా బోటుపైకి ఎక్కారు. ఫోన్లు సముద్రంలో పడిపోయాయి. అక్కడి నుంచి వీరి హృదయ విదారక గాథ ప్రారంభమైంది. పట్టించుకునే వారు లేరు. 10 నాటికల్ మైళ్లు ఈత కొడితే తప్ప ఒడ్డుకు రారు. గంట గంటకు బోటు మునిగిపోతోంది. అలాంటి పరిస్థితుల్లో బోటు కింది భాగంలో ఒక మనిషి చనిపోయాడు. మిగతా వారు అక్కడి నుంచి ఈత కొట్టడం మొదలు పెట్టారు. గంటలో ఇంటికి వస్తానన్న మనిషి 3 గంటలైనా రాకపోయే సరికి.. వీరి మేనల్లుడు తిరిగి ఫోన్లు చేయడం మొదలుపెట్టాడు. ఆ పక్కన ఫోన్లు రిసీవ్ చేసుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో వారి కుటుంబీకులు అధికారులకు విన్నవించే ప్రయత్నం చేశారు. రాత్రి 7 గంటలకు మత్స్యశాఖ అధికారులను కలిసి విన్నవించినా ఎవరూ స్పందించ లేదు. ఏడుగురు కలిసి వేటకు వెళితే ప్రమాదానికి గురై 20 గంటల పైచిలుకు సముద్రంతో యుద్ధం చేసి ఒక్కడే తిరిగొచ్చారు.  ఆదుకోవాలని సమాచారమిచ్చినా ప్రభుత్వం స్పందించలేదు. ఆదుకున్న పాపాన పోలేదు. సకాలంలో స్పందించి ఉంటే ఐదారుగురు బతికి ఉండేవాళ్లు. అసలు ఈ ప్రభుత్వానికి మానవత్వం ఉందా?

### తోడుగా ఉన్నామన్న భరోసా ఏదీ?

ఇంత ఘటన జరిగితే సీఎం పట్టించుకోరు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చూసే ఈ జిల్లా వాసి అయిన మంత్రి కనీసం రాలేదు. ఇదే ఉత్తరాంధ్రకు చెందిన మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కనీసం ఇంటికి కూడా రాలేదు. పైగా ఏమంటారో తెలుసా? వీడియో కాల్‌లో వీరి కుటుంబాలను పరామర్శించామని హోం మంత్రి అనితమ్మ అంటోంది. ఒక్కరంటే ఒక్కరు బాధ్యత గల స్థానాల్లో ఉన్న  వారు పట్టించుకోలేదు.

## ఈసారి రూ.90 కోట్లు

హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరో లంచగొండి అధికారిపై కొరడా ఝుళిపించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీలో (హెచ్ఎండీఏ) చీఫ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న బచ్చు రవీందర్‌పై ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలపై కేసు నమోదు చేసింది. వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన ఏసీబీ సిటీ రేంజ్--1 అధికారులు ఆయన బినామీలను గుర్తించడంతోపాటు కీలక సమాచారం సేకరించారు. దీని ఆధారంగా మంగళవారం హై దరాబాద్, నిజామాబాద్‌ల్లో ఏకకాలంలో తొమ్మిది ప్రాంతా ల్లో సోదాలు నిర్వహించారు. వీటిలో రవీందర్ ఇల్లు, కార్యాలయంతోపాటు ఆయన బంధువులు, బినామీల ఇళ్లుఉన్నాయి.  రవీందర్ తన ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని అవినీతి, అక్రమ మార్గాల ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో చేసిన సోదాల్లో కొండకల్, కిస్తాపూర్, పసుమాములలో ఐదు ప్లాట్లకు సంబంధించిన పత్రాలు లభించాయి. వీటి అధికారిక విలువ రూ.38,89,700గా ఏసీబీ నిర్ధారించింది. అలాగే నార్సింగి, నానక్‌రామ్‌గూడల్లో రూ.2,07,40,000 విలువైన నాలుగు ఫ్లాట్లు, కొత్తూరు మండలం గూడూరు గ్రామం, శంషాబాద్‌ల్లో రూ.6 లక్షల విలువైన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి, రూ.1,33,58,800 విలువైన మోకిలాలోని శ్రీవారి మెడోస్‌లో 300 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న విల్లా, రూ.3 కోట్ల విలువైన కొండాపూర్‌లోని మసీదు బండ ప్రాంతంలో 300 చదరపు గజాల్లో నిర్మించిన జీ౦4 భవనానికి సంబంధించిన పత్రాలు స్వాదీనం చేసుకున్నారు.   అలాగే, రూ.3.82 లక్షల నగదు, 1.44 కేజీల బంగారం, 12.5 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఇంట్లో రూ.17,24,000 విలువైన గృహోపకరణాలు, రూ.9.32 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, రూ.1.16 కోట్ల విలువైన నాలుగు వాహనాలు (ఇన్నోవా హైక్రాస్, టాటా సఫారి, ఇన్నోవా క్రిస్టా, మహీంద్రా ఎక్స్‌యూవీ) స్వాధీనం చేసుకున్నారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.45,05,776 బ్యాలెన్స్ ఉన్నట్లు గుర్తించారు. ఈ స్థిరచరాస్తుల విలువ అధికారిక లెక్కల ప్రకారం రూ.9,24,02,276 ఉంటుందని ఏసీబీ అధికారులు ప్రకటించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.90 కోట్ల కు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు లో ఉందని, రవీందర్‌ను అరెస్టు చేశామని అధికారులు ప్రకటించారు. విచారణ అనంతరం బుధవారం ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. రవీందర్‌తోపాటు ఆయన కుటుంబీకులు, బినామీలకు సంబంధించిన ఇతర స్థిరచరాస్తులు గుర్తించే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.   గత ప్రభుత్వ హయాంలో బీఎల్ఎన్ రెడ్డి చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలను నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆయన ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. ఆ తరువాత సీనియర్ ఇంజనీర్ పరంజ్యోతి కొంతకాలం చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. సీనియారిటీలో భాగంగా రవీందర్‌కు ఈ పదవి దక్కింది. అప్పటి వరకు ఆయన హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ అయిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) సీజీఎంగా పనిచేశారు. ఇంజనీరింగ్ విభాగంలో వివిధ హోదాల్లో పని చేశారు.

# అసలు సమస్యే రాకుండా చూసేవాడు అద్భుతమైన అధికారి

(మొదటి పేజీ తరువాయి)

నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్) ద్వారా రాష్ట్ర ప్రగతిని సమీక్షించుకునే విధానానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. "ఇకపై ప్రతీ నెలా ఆర్థిక నివేదికలు విడుదల చేస్తాం. వాటి ఆధారంగా ప్రభుత్వ శాఖల పనితీరు, రెవెన్యూ రాబడులు, అధికారుల నైపుణ్యాలను అంచనా వేసుకుని ముందుకు వెళ్తాం. ప్రతీ నెలా కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమావేశమై పురోగతిని సమీక్షించుకుందాం," అని తెలిపారు. గత ఐదేళ్ల (2019-24) పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని, విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "గత రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం సమిష్టిగా పనిచేసి, క్షేత్రస్థాయిలో కొంతవరకు మార్పు తేగలిగాం. గత పాలనలో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం పోయింది. మేం వచ్చాక పరిస్థితి మార్చి, దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం" అని అన్నారు. వికసిత్ భారత్



లక్ష్యాలకు అనుగుణంగా 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను రూపొందించామని, తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని శాఖల పనితీరు సరిగా లేకపోవడంతో, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో భూ వివాదాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పెట్టుకోవాలని అన్ని శాఖలకు సూచించారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి ప్రాంతాల్లో భూ సమస్యలను పరిష్కరించామని, రీసర్వే ద్వారా ప్రతి నెలా 9వ తేదీన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు.

### ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై స్పష్టత

రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో దృష్టి సారించిందని సీఎం తెలిపారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆగస్టు 14న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేస్తామని, సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## పుట్టగూడెం తండాలో ద్విచక్ర వాహనం అపహరణ

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని పుట్టగూడెం తండాలో ద్విచక్ర వాహనం అపహరణకు గురైనట్లు ఎస్ఐ లింగారెడ్డి మంగళవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం మూడు చింతలపల్లి పరిధిలోని లక్ష్మాపూర్ తండాకు చెందిన గుగులోతు రవి ఈ నెల 12న రాత్రి పుట్టగూడెం తండాలోని తన సోదరుడు భూక్యా నగేష్ ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి నిద్రపోయాడు. 13వ తేదీ ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం రాజాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గురుకులాల్లో పార్ట్‌టైమ్ పోస్టుల భర్తీ

- జూలై 18న భువనగిరి సీవోఈలో ఇంటర్వ్యూలు, డెమోలు
- ఉపాధ్యాయులు, లెక్చరర్లు, లైబ్రేరియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**తొలివెలుగు, రాజాపేట :** యాదాద్రిభువనగిరి జిల్లా పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్) ఖాళీగా ఉన్న పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లు (జేఎల్), డిగ్రీ లెక్చరర్లు (డీఎల్), లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ఈ నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 18వ తేదీన భువనగిరిలోని సోషల్ వెల్ఫేర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలు, డెమోలకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

**ఖాళీల వివరాలు:**

- భువనగిరి (బాలురు): టీజీటీ హిందీ, జేఎల్ గణితం.
- రాజాపేట (బాలురు): టీజీటీ గణితం, జేఎల్ ఫిజిక్స్.
- ఆలేరు (బాలికలు): పీఈటీ/పీడీ, టీజీటీ హిందీ.
- అడ్డగూడూరు (బాలికలు): టీజీటీ గణితం, జేఎల్ ఇంగ్లిష్, జేఎల్ కెమిస్ట్రీ (లీవ్ వేకెన్సీ).
- వలిగొండ ఏ బీబీనగర్ (బాలికలు): టీజీటీ హిందీ, జేఎల్ కెమిస్ట్రీ (లీవ్ వేకెన్సీ).
- చౌటుప్పల్ ఏ తూప్రాన్‌పేట్ (బాలికలు): పీజీటీ బయోసైన్స్, టీజీటీ హిందీ.
- మోత్కూరు (బాలురు): టీజీటీ హిందీ, జేఎల్ గణితం.
- భువనగిరి ఏ దేశ్‌ముఖి ఆర్ట్స్ ఫోర్సెస్ డిగ్రీ కళాశాల (మహిళలు): డీఎల్ స్టాటిస్టిక్స్, డీఎల్ కామర్స్, డీఎల్ కెమిస్ట్రీ (లీవ్ వేకెన్సీ), లైబ్రేరియన్ పోస్టులు.

అర్హత గల అభ్యర్థులు నిర్ణీత తేదీన అవసరమైన విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా సమన్వయ అధికారి సూచించారు.

## సాయి మందిరంలో అన్నప్రసాద వితరణ

- దాత దంపతులను సత్కరించిన ఆలయ కమిటీ



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. రాజాపేటకు చెందిన దివంగత బెజగం అంజయ్య-శకుంతల పుణ్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు బెజగం కృష్ణమూర్తి-పద్మకుమారి దంపతులు ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దాదాపు 500 మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు ఉదారతతో ముందుకు వచ్చిన దాత దంపతులు కృష్ణమూర్తి-పద్మకుమారిలను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మార్త జగదీశ్వర్, బెజుగం నాగభూషణం, ఇమ్మడి శ్రీనివాసులు, ఇమ్మడి నర్సింలు, నంగునూరు రాజు, ఉప్పల శ్రీనివాసులు, బెజుగం శ్రీనివాసులు, బెజుగం చంద్రశేఖర్, బుడమ సత్యనారాయణ, నాళ్ళ శేఖర్, గంగిశెట్టి రాజు, పుల్లూరు శ్రీనివాసులు, ఉప్పల రమేష్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతు కుటుంబానికి మదర్ డెయిరీ ఆసరా

- యాదగిరి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని మల్లగూడెం గ్రామానికి చెందిన పాడి రైతు గొడుగు యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. ఆయన కుటుంబానికి మంగళవారం నార్ముల్ మదర్ డెయిరీ తరఫున రూ.10,000 ఆర్థికసాయాన్ని అందజేశారు. మదర్ డెయిరీ రాజాపేట పాల కేంద్రం మేనేజర్ మాధవరం శేఖర్, గ్రామ సర్పంచ్ జెన్నేపల్లి బాలరాజు రెడ్డి, పాల సొసైటీ చైర్మన్ గొడుగు కనకయ్యల ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులకు ఈ నగదును అందజేసి పరామర్శించారు. కష్టకాలంలో ఉన్న పాడి రైతు కుటుంబాలను ఆదుకోవడానికి మదర్ డెయిరీ నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రెడ్డబోయిన కవితారాజు, పాల సొసైటీ పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు మాలి మాధవ రెడ్డి, రంగ పాండు, గొడుగు రాజు, బోయిని కనకయ్య, పాల కేంద్రం సూపర్ వైజర్ రాములు, వేతన కార్యదర్శి నీల కుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# గౌరిగే నరసింహ ఆశయాలను కొనసాగించాలి

- హక్కుల కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి: ఉజ్జిని రత్నాకర్ రావు
- రామన్నపేటలో ఘనంగా గౌరిగే నరసింహ సంతాప సభ




**తొలివెలుగు, రామన్నపేట :** ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన దివంగత గౌరిగే నరసింహ ఆశయాలను కార్మికులు ముందుకు తీసుకెళ్లాలని ఏఐటీయూసీ జాతీయ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు అన్నారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ప్రాంగణంలో గౌరిగే నరసింహ సంతాప సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నరసింహ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రత్నాకర్ రావు మాట్లాడుతూ.. నరసింహ జీవితాంతం కార్మికుల హక్కుల కోసం అంకితభావంతో పనిచేసిన నిజాయితీ గల నాయకుడని కొనియాడారు. సివిల్ సప్లై హమాలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను హరిస్తోందని ఆరోపించారు. కార్మిక వర్గానికి సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బత్తుల సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, సివిల్ సప్లై యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ, సీపీఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, రామన్నపేట సివిల్ సప్లై గోదాం ఇన్‌చార్జి కుసుమ, డీఈఓ ఊర్మిళ, హమాలి యూనియన్ నాయకులు గౌరిగే శంకరయ్య, పాపగల్ల శంకరయ్య, పిగ్నం జగన్, కస్తూరి కొండల్, పురుగుల రవి, దివంగత నరసింహ కుమారుడు నరేష్, కోడలు శైలజ, అలాగే హమాలి నాయకులు ముదిగొండ బసవయ్య, జంగా నర్సయ్య, బండ స్వామి, గోర్ల తిరుపతి, కోటూరి శ్రీనివాస్, మడుగుల స్వామి, మోటే నగేష్, జీడయ్య, జంగయ్య, రమేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వీడాలి

- పీహెచ్‌సీల్లో 'జీరో డెలివరీ' నమోదు కాకూడదు
- డిజిటల్ మిషన్‌లో మోడల్ జిల్లాగా యాదాద్రి భువనగిరి
- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు






**తొలివెలుగు, భువనగిరి:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి ఆయన ఆరోగ్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి:**

ఏ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ (పీహెచ్‌సీ) ప్రసవాలు జరగలేదనే (జీరో డెలివరీ) పరిస్థితి ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. గర్భిణులకు ముందస్తు పరీక్షలు, ఏఎన్‌సీ, పీఎన్‌సీ సందర్శనలు, యూఎస్‌జీ, టిఫ్ఫా స్కాన్లతో పాటు హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు నిర్ణీత గడువులోగా ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయాలని, అవసరమైతే మెడికల్, నర్సింగ్ విద్యార్థుల సేవలను వాడుకోవాలని సూచించారు. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల (ఎన్‌క్యూఏఎస్) కింద ఎంపికైన 11 పీహెచ్‌సీల్లో పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

**ఈ-ఆరోగ్య పోర్టల్‌లో నమోదు తప్పనిసరి:**

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) అమలులో జిల్లాను ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోగికి 'ఆభా' (ఏబీహెచ్‌ఏ) ఖాతా తెరవడంతో పాటు ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ రిపోర్టులను తప్పనిసరిగా 'ఈ-ఆరోగ్య' పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించి డెంగ్యూ, మలేరియా వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం. మనోహర్, డీసీహెచ్ఎస్ డా. సూర్యశ్రీ, ఆసుపత్రి సూపరింటెండెంట్, డీఐవో డా. రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సుమన్ కళ్యాణ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డా. వీణ, డీఆర్‌డీవో నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- నేడు ఇందిరా పార్కు వద్ద మహాధర్నా: సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

**తొలివెలుగు, రామన్నపేట:** దేశంలోనూ, రాష్ట్రంలోనూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. మంగళవారం రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో కూరెళ్ల నర్సింహాచారి అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటి భర్తీలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఏడాది లక్షలాది మంది యువత చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నా, తగిన ఉపాధి కల్పించకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. నియామక ప్రకటనల్లో జాప్యం, పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం తన హామీ మేరకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**మహాధర్నాను జయప్రదం చేయండి:**

నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 15న (బుధవారం) హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే సీపీఎం మహాధర్నాకు నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని జహంగీర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి, మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గురి అంజయ్య, జంపాల అండాలు, కందుల హనుమంతు, ఆవనగంటి నగేష్, గన్నెబోయిన విజయభాస్కర్, గౌరిగే సోములు, నాగటి ఉపేందర్, బొడిగే రజిత, తొలుపునూరి శ్రీనివాస్, మునికుంట్ల లెనిన్, తాళ్లపల్లి జితేందర్, శానగొండ వెంకటేశ్వర్లు, గోగు లింగస్వామి, జోగుల ధనలక్ష్మి, కొమ్ము అంజమ్మ, నాగటి లక్ష్మణ్, అప్పం సురేందర్, ఆముద ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




# ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టులు దుర్మార్గం

- సచివాలయ ముట్టడి పిలుపు నేపథ్యంలో పోలీసుల చర్య
- ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి: మండల కార్యదర్శి ఉదయ్ కుమార్

**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చిన సచివాలయ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా విద్యార్థి నాయకులను రామన్నపేటలో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం రామన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాస్తూ నాయకులను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు. రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు అందక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు రూ. 11 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న బకాయిల వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు పెద్ది అక్షిత, మండల నాయకులు అప్పం అభిరూప్, మామిడి నవీన్, పిట్టల నవీన్, బూడిద ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.





# అధికారులకు ఓటరు ఎన్యుమరేషన్ ఫారాల అందజేత

- ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జమీరుద్దీన్

**తొలివెలుగు, రామన్నపేట:** అర్హులైన ప్రజలందరూ తమ ఓటరు వివరాలను ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు చేసుకోవాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్ కోరారు. రామన్నపేట మండల కేంద్రంలోని హరిజనవాడ కాలనీలో మంగళవారం ఓటరు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ కార్యక్రమం జరిగింది. జమీరుద్దీన్ ఆధ్వర్యంలో కాలనీవాసులు తమ ఎన్నికల ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి నింపిన దరఖాస్తులను ఎన్నికల శాఖ సీనియర్ అసిస్టెంట్ రమావత్ వినీతాబాయి, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) మేడి లలితలకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ బాధ్యతను చాటుకోవాలని సూచించారు. కాలనీల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా వివరాల నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొడ్డు సాలయ్య, సురేందర్ రావు, గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ నకిరేకంటి రాములు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు 'సదరం' సర్టిఫికెట్లు ఇప్పించాలి

- భవిత కేంద్రాన్ని సందర్శించిన న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మాధవీలత
- 'యుడీఐడీ' రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆదేశం



**తొలివెలుగు, భువనగిరి టౌన్:** మానసిక వైకల్యం ఉన్న బాలబాలికలకు సదరం ధ్రువపత్రాలు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత ఆదేశించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షుడు ఎ.జయరాజు సూచనల మేరకు మంగళవారం ఆమె భువనగిరి పట్టణంలోని 'భవిత' విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ (ఎన్ఏఎల్ఎస్ఏ) ద్వారా దివ్యాంగులకు అందుతున్న సేవలపై ఆమె సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భవిత కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న మానసిక వైకల్యం ఉన్న విద్యార్థులకు సదరం క్యాంపుల ద్వారా సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూడాలన్నారు. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి వివరాలతో వెంటనే 'యుడీఐడీ' రిజిస్ట్రేషన్లు చేయించాలని పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డికి సూచించారు. సదరం, యుడీఐడీ ధ్రువపత్రాలు పొందడం ద్వారానే దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందుతాయని ఆమె స్పష్టం చేశారు.

# ఒకేషనల్ చదువులతోనే ఉపాధి అవకాశాలు

- మెగా జాబ్ మేళాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ
- టాటా, కియా, టీవీఎస్ సంస్థల్లో 22 మందికి కొలువులు
- అభినందించిన జిల్లా నోడల్ అధికారి సురేష్ రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులు (ఒకేషనల్) చదవడం ద్వారా చదువుతో పాటే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా నోడల్ అధికారి సురేష్ రెడ్డి తెలిపారు. నల్గొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో భూదాన్ పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఒకేషనల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. టాటా ఎలక్ట్రానిక్స్, కియా, టీవీఎస్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలలో కళాశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను జిల్లా నోడల్ అధికారి సురేష్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ తులసి, ఒకేషనల్ అధ్యాపకులు చందన, శ్రీదేవి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.




# పోచంపల్లి సమగ్ర అభివృద్ధికి కృషి





- రూ.56 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో నియోజకవర్గ ప్రగతి
- రూ.7.9 కోట్లతో పట్టణంలో వివిధ పనులు
- నూతన పారిశుద్ధ్య వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పర్యాటక కేంద్రమైన పోచంపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పురపాలక కేంద్రంలో పర్యటించిన ఆయన.. 15వ ఆర్థిక సంఘం నిధులతో మున్సిపాలిటీ కొనుగోలు చేసిన రెండు నూతన చెత్త సేకరణ ఆటోలను మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పట్టణ అభివృద్ధి పనులపై విస్తృత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గ పరిధిలోని పట్టణాల అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.56 కోట్ల హెచ్ఎండీఏ నిధులను మంజూరు చేయించినట్లు వెల్లడించారు. పోచంపల్లి సుందరీకరణ, స్వచ్ఛతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టణంలో ప్రస్తుతం రూ.7.9 కోట్ల వ్యయంతో చేపట్టిన మినీ ట్యాంక్ బండ్, అంతర్గత మురుగు కాలువలు, వైకుంఠ ధామం, విద్యుత్ మౌలిక వసతుల పనులతో పాటు అమృత్ పథకం కింద నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన వాహనాల ద్వారా స్వచ్ఛతను పెంపొందించి, 'స్వచ్ఛ పోచంపల్లి' సాధనకు ప్రజలు, అధికారులు సమన్వయంతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీరామ మంజుల లింగస్వామి, కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య, పెద్దల చక్రపాణి, బాత్క లింగస్వామి యాదవ్, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్యా వేణు, దేవరాయ కుమార్, జింకల లావణ్య యాదగిరి, కో-ఆప్షన్ సభ్యులు మద్ది మధుసూదన్ రెడ్డి, ఎజాజ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవ కుమార్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- ఎమ్మెల్యేల జీతాలకు నిధులుంటాయి.. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు ఉండవా?
- రూ.10,500 కోట్ల బకాయిలతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం
- ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టులపై మండల కమిటీ మండిపాటు




**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన "చలో సచివాలయం" కార్యక్రమానికి బయలుదేరుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్, కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నిలిచిపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేదనే నెపంతో విద్యాసంస్థలు సర్టిఫికెట్లు ఆపడం వల్ల ఉన్నత చదువులకు ఆటంకం కలుగుతోందని విమర్శించారు. ఒకవైపు ప్రజాప్రతినిధుల జీతభత్యాలకు నిధుల కొరత లేనప్పుడు, విద్యార్థుల చదువులకే కరువు వచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకునే ప్రజాపాలన ఇదేనా అని నిలదీశారు. పోలీసుల ముందస్తు అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణచివేయలేరని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు దాసరి ప్రకాష్, తిగుళ్ళ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సావిత్రి మనోజ్ కుమార్, మండల కమిటీ సభ్యుడు పోలేపల్లి మల్లేష్ తదితరులు ఉన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని వారు డిమాండ్ చేశారు.




# ప్రభుత్వ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి

- నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి ఇవ్వాలి
- ?నేడు ఇందిరాపార్క్ వద్ద సీపీఎం మహా ధర్నా
- కరపత్రాన్ని విడుదల చేసిన సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి కరుణాకర్

**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ డిమాండ్‌తో ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆయన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షలాది కొలువులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ?కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పించాలని, కేంద్ర శాఖల్లోని 10 లక్షల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని, పోలీస్ శాఖలో 20 వేల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, రాజీవ్ యువ వికాస్ పథకాలను అమలు చేయాలని కోరారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి చెల్లించడంతో పాటు బ్యాక్ లాగ్ పోస్టులన్నీ భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, నాయకులు బత్తుల దాసు, తొర్పునూరి మల్లేశం, అందగట్ల ఆనంద్, కనకయ్య, చికూరు ఈదయ, జంగయ్య, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ నూతన చైర్మన్‌గా కృష్ణారెడ్డి నియామకం

- నియామక పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా: కృష్ణారెడ్డి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పురపాలక కేంద్రంలోని శాఖ గ్రంథాలయ నూతన చైర్మన్‌గా చింతకుంట్ల కృష్ణారెడ్డి నియమితులయ్యారు. మంగళవారం ఆయనకు సంబంధించిన నియామక పత్రాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పురపాలక కేంద్రంలో అధికారికంగా అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ జారీ చేసిన ఈ నియామక పత్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా కృష్ణారెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచి, పాఠకులకు, స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా నిష్పక్షపాతంగా కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు పాక మల్లేష్ యాదవ్, పట్టణ, మండల శాఖల అధ్యక్షులు భారత లవ కుమార్, ఉప్పునూతల వెంకటేష్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, కౌన్సిలర్ దేవరాయ కుమార్, సురపల్లి రాధిక రమేష్, కో-ఆప్షన్ సభ్యుడు మద్ది మధుసూదన్ రెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

- ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డికి వినతి
- అసెంబ్లీలో సీఎం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని మండల ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు జింకల యాదగిరి కోరారు. మంగళవారం పురపాలక కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో ఉద్యమకారులు భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలంతో పాటు నెలకు రూ.25 వేల పింఛను వెంటనే మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ.. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు కొట్టం కరుణాకర్ రెడ్డి, చిలువేరు బాల నరసింహ, చింతల రామకృష్ణ, చింతకింది కిరణ్, సీత శ్రవణ్, మహమ్మద్ జహంగీర్, తండా శ్రీశైలం, కలుకూరి పాండు, సీతా పాండు, ఎడ్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సరూర్‌నగర్‌లో స్థల పరిశీలన

**తొలివెలుగు,ఆర్కేపురం, జూలై 14 :** నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జూలై 18న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియం మైదానంలో యువ సంగ్రామ సదస్సు స్థలాన్ని సోమవారం ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, నోముల భగత్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పరిశీలించారు. కాగా సదస్సుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవనున్నారు.



# గ్రామ పంచాయతీలకు 'సీసీ' చార్జీల సెగ

- 15వ ఆర్థిక సంఘం నిధుల మళ్లింపుపై సర్పంచుల ఆందోళన
- విద్యుత్ బిల్లుల బకాయిలతో అభివృద్ధి పనులకు బ్రేక్..!
- భారాన్ని ప్రభుత్వం భరించాలి: జిల్లా సర్పంచుల ఫోరం



**తొలివెలుగు, భువనగిరి/ఆత్మకూరు (ఎం):** యాదాద్రిభువనగిరి జిల్లాలో గ్రామ పంచాయతీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో విద్యుత్ వినియోగ (సీసీ) చార్జీల బకాయిలు చెల్లించాలని అధికారులు ఒత్తిడి తీసుకురావడంపై సర్పంచులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లుల బకాయిల పేరుతో టీజీఎస్‌పీడీసీఎల్‌కు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ఈ నిర్ణయాన్ని వెంటనే పునఃపరిశీలించాలని జిల్లా సర్పంచుల ఫోరం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొప్పుల వెంకట్ రెడ్డి, ఆత్మకూరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సర్పంచులు మంగళవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం సమర్పించారు.

**అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం:**

గ్రామ పంచాయతీలకు గత కొంతకాలంగా నిధుల కొరత నెలకొనడంతో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మోటార్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు వంటి కనీస అవసరాలకే ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచులు తెలిపారు. అనేక గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచులే వ్యక్తిగతంగా అప్పులు చేసి ఖర్చులు భరిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి సమయంలో విద్యుత్ బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆదేశించడం గ్రామ పంచాయతీలపై మరింత ఆర్థిక భారం మోపినట్లేనని పేర్కొన్నారు.

**రూ.15 లక్షల నుంచి రూ.కోటివరకు బకాయిలు:**

జిల్లాలోని చిన్న గ్రామ పంచాయతీలకు సుమారు రూ.15 లక్షల వరకు, మధ్యతరహా గ్రామాలకు రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు, పెద్ద గ్రామ పంచాయతీలకు రూ.1 కోటి వరకు విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ఈ బకాయిలను పంచాయతీల సొంత నిధుల నుంచే చెల్లించాల్సి వస్తే ఐదేళ్లలో వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులన్నీ విద్యుత్ బిల్లులకే ఖర్చవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**గ్రామాలు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం:**

పంచాయతీల నిధులు విద్యుత్ బిల్లులకే వెచ్చించాల్సి వస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందని సర్పంచులు హెచ్చరించారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి ప్రజలకు అత్యవసరమైన సేవలు తీవ్రంగా దెబ్బతింటాయని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతే గ్రామాలు తిరిగి వెనుకబాటుకు వెళ్లే ప్రమాదం ఉందన్నారు.

**పంచాయతీలపై మాత్రమే భారం ఎందుకు?**

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయాన్ని గుర్తు చేసిన సర్పంచులు, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే గ్రామ పంచాయతీలపై మాత్రం విద్యుత్ బిల్లుల భారాన్ని మోపడం న్యాయం కాదన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన సేవలు అందించే పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీ కల్పించాలని కోరారు.

**నిధుల మళ్లింపును నిలిపివేయాలి:**

15వ ఆర్థిక సంఘం నిధులను సాంకేతిక కారణాలు చూపుతూ విద్యుత్ శాఖకు మళ్లించకుండా నిలిపివేయాలని, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని కాపాడాలని సర్పంచుల ఫోరం డిమాండ్ చేసింది. విద్యుత్ బిల్లుల సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపి గ్రామాభివృద్ధికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. గ్రామ పంచాయతీలు బలోపేతమైతేనే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని, పంచాయతీలపై అదనపు ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచుల ఫోరం నాయకులు కోరారు.

# 'వృక్షో రక్షతి రక్షితః' ఆచరణలో పెట్టాలి



- పచ్చదనంతోనే భావితరాలకు స్వచ్ఛమైన గాలి
- చౌటుప్పల్‌లో ఘనంగా వనమహోత్సవం
- మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ 'వృక్షో రక్షతి రక్షితః' అనే సూక్తిని ఆచరణలో పెట్టాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 9వ వార్డు తిరుమల వెంచర్ (తిరుమల టౌన్షిప్ కాలనీ) వార్డు కార్యాలయ ప్రాంగణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్.. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్‌తో కలిసి పలు రకాల నీడనిచ్చే, పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమని స్పష్టం చేశారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తామని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడం అభినందనీయమన్నారు. నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకునే బాధ్యతను కాలనీవాసులు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు కోసనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ఊదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, ఆలే శ్రీలత చిరంజీవి, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బద్రి గాలయ్య, దేప రమ్య రాజు, పాక చిరంజీవి, బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్, ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, గడ్డం ఇందిర రాజరత్నం, బత్తుల జయమ్మ దాస్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, ఎండీ హన్ను, కో-ఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, ఎండీ బాబా షరీఫ్, షేక్ నబీబి జానీబాబు, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, కాలనీ అధ్యక్షుడు మేడి రాములు, స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి పనుల క్షేత్రస్థాయి పరిశీలన

- వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- తంగడపల్లి రోడ్డుకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 20వ వార్డు కౌన్సిలర్ ఎండీ హన్ను చొరవతో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కమిషనర్ వెంకటేశ్వర నాయక్, స్థానిక కౌన్సిలర్లు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హన్ను మాట్లాడుతూ.. జాతీయ రహదారి నిర్మాణ పనుల కారణంగా స్థానిక ప్రజలు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించి, ప్రజల రాకపోకలు సాఫీగా సాగేందుకు స్థానిక గ్రంథాలయం పక్క నుంచి ఫారెస్ట్ కార్యాలయం మీదుగా తంగడపల్లి రోడ్డుకు అనుసంధానంగా ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, కొయ్యడ శేఖర్ గౌడ్, ఆలే శ్రీలత చిరంజీవి, బుడ్డా సురేష్, దేప రమ్య రాజు, పిల్లలమర్రి మధుసూదన్, ఊదరి యాదయ్య, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, గడ్డం ఇందిరా రాజారత్నం, పాక చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దళితులపై దాడుల నివారణలో ప్రభుత్వాల వైఫల్యం

- గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ సామాజిక అణచివేత
- అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం నేత గంగాదేవి సైదులు



**తొలివెలుగు, చౌటుప్పల్:** దేశంలో దళితులపై జరుగుతున్న కుల వివక్ష, సామాజిక అణచివేత, దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు విమర్శించారు. మంగళవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో దళితులు భూహక్కులు, ఉపాధి, గృహాలు, తాగునీరు వంటి మౌలిక వసతుల విషయంలో నేటికీ వివక్షను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి బాధితులకు తగిన న్యాయం చేయాలని, దళితుల ఆర్థికాభివృద్ధికి ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు యాట బాలరాజు, చింతల సుదర్శన్, జిల్లా కమిటీ సభ్యులు బోయ యాదయ్య, మానే సాలయ్య, మండల నాయకులు యాట ముత్యాలు, పొట్ట వెంకటయ్య, నేరేడు మహేష్, జంగం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్షకు బీఆర్‌ఎస్‌వీ సంఘీభావం

- ఫీజుల స్కీమ్ రద్దు కుట్రలను విరమించుకోవాలి
- రూ.8,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- మద్దతు తెలిపిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీఆర్‌ఎస్‌వీ నేత నలపరాజు రమేష్

**తొలివెలుగు, మునుగోడు/హైదరాబాద్:** ఫీజుల పథకాన్ని రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను ఖండిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు బీఆర్‌ఎస్‌వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీక్షా శిబిరానికి చేరుకున్న ఆయన, ఆర్. కృష్ణయ్యకు పూలదండ వేసి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై దీక్షకు తన మద్దతును పంచుకున్నారు. ఈ సందర్భంగా నలపరాజు రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల పాలిట వరంగా ఉన్న ఫీజుల స్కీమ్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం చూస్తే ఊరుకునేది లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాత విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని, ప్రభుత్వం మొండివైఖరి వీడి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

# జీపీవో, బీఎల్‌వోలకు ఘన సన్మానం

- ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసిన అధికారులకు అభినందనలు
- సత్కరించిన సర్పంచ్ కళావతి లింగయ్య




**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం):** ఆత్మకూర్ (ఎం) మండలంలోని రహీం ఖాన్‌పేట గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా విజయవంతంగా పూర్తి చేసినందుకు గ్రామ పంచాయతీ అధికారి (జీపీవో) రాజయ్యతో పాటు బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) మంగళవారం ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ కళావతి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులకు శాలువాలు కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కళావతి లింగయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులను బాధ్యతాయుతంగా, సమయపాలనతో పూర్తి చేసిన జీపీవో, బీఎల్‌వోల సేవలు అభినందనీయమని అన్నారు. ఇదే నిబద్ధతతో భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు చౌటుప్పల్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం
- సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు
- ఏఈ రాజుల సతీష్ వెల్లడి

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాజుల సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టాల్సి ఉన్నందున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. చౌటుప్పల్ పట్టణ పరిధి, లింగోజిగూడెం, జిబ్లాక్‌పల్లి, చిన్నకొండూరు వ్యవసాయ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ అంతరాయం ఉంటుందని వివరించారు. ఈ ప్రభావిత ప్రాంతాల వినియోగదారులు, రైతులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, మరమ్మత్తు పనులు సజావుగా సాగేందుకు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.



# చెన్నైకి మకాం మార్పు



కమల్‌హాసన్ ముద్దుల తనయ శృతిహాసన్ చెన్నైలో కొత్త ఇంటిలోకి అడుగుపెట్టింది. గృహ ప్రవేశానికి సంబంధించిన ఫొటోలను తన సోషల్‌మీడియా ఖాతాల ద్వారా పంచుకుంది. దాదాపు 40కోట్ల వ్యయంతో తన అభిరుచికి తగినట్లు శృతిహాసన్ ఇంటిని డిజైన్ చేసుకుందట. సోమవారం జరిగిన గృహ ప్రవేశ వేడుకలో ఆమె సోదరి అక్షరహాసన్‌తో పాటు కొద్దిమంది స్నేహితులు పాల్గొన్నారు. కెరీర్ ఆరంభం నుంచి దాదాపు పదిహేనేళ్లుగా ముంబయిలో నివాసం ఉంటున్నది శృతిహాసన్. అయితే గతకొంతకాలంగా బాలీవుడ్‌లో ఈ భామకు అవకాశాలు తగ్గాయి. వ్యక్తిగత జీవితంలో కూడా ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశ్యంలో తిరిగి చెన్నైకి మకాం మార్చిందని అంటున్నారు. ఇక నుంచి దక్షిణాది సినిమాలకే ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయం కూడా ఈ భామ చెన్నైకి షిఫ్ట్ కావడానికి ఓ కారణమని చెబుతున్నారు. ఇటీవలే 'పెద్ది' సినిమాలో ఐటెం సాంగ్‌లో మెరిసిన ఈ సొగసరి ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో నటిస్తున్నది.

# రవితేజ–శ్రీవిష్ణు మల్టీస్టారర్ పై క్రేజీ బజ్..

మాస్ మహారాజా రవితేజ మరియు కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు కాంబినేషన్‌లో ఒక క్రేజీ మల్టీస్టారర్ చిత్రం రూపుదిద్దుకోనున్నట్లు సినీ సర్కిల్స్‌లో గతకొద్ది రోజులుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ సినిమాను దర్శకుడు హసిత్ గోలి డైరెక్ట్ చేయనున్నాడని.. త్వరలోనే ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. అయితే ఈ సినిమా కోసం ఓ ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారట. ఈ సినిమాకు 'వీరాధి వీరులంట' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారట. టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ భారీ చిత్రాన్ని నిర్మించనున్నారు. పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను రాబోయే సంక్రాంతి 2027 కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. మరి ఈ సినిమాపై అధికారిక ప్రకటన.. టైటిల్ పై క్లారిటీ ఎప్పుడు ఇస్తారో వేచి చూడాలి.



# ఈసారి రెట్టింపు వినోదం

అగ్ర హీరో వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో హిట్ మిషిన్ అనిల్ రావిపూడి ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మాతగా, సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన సమర్పణలో, జీ స్టూడియోస్ సహ నిర్మాణంలో రూపొందున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల కానున్నది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇటీవలే కల్యాణ్‌రామ్, ఇతర నటీనటులపై చిత్రీకరించిన ఓ పాటను చిత్రబృందం పూర్తి చేసింది. వీశీజఅవం

తాజాగా విక్టరీ వెంకటేశ్ ఈ సినిమా షూట్‌లో జాయిన్ అయ్యారు. ప్రస్తుతం ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి ఈ సన్నివేశాల్లో పాల్గొటున్నారు. వెంకీ, కల్యాణ్‌రామ్ కాంబినేషన్ సన్నివేశాలు చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, అనిల్ రావిపూడి ఈసారి రెట్టింపు వినోదాన్ని పంచనున్నారని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్.





# మాతృత్వం నా జీవితంలో అత్యంత అందమైన అధ్యాయం.. సమంత ఎమోషనల్ కామెంట్స్

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన జీవితంలో అత్యంత ఆనందకరమైన దశను ఆస్వాదిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న ఆమె, ఇప్పుడు మాతృత్వాన్ని ఆహ్వానిస్తూ కొత్త జీవితానికి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా మాతృత్వం గురించి సమంత చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తాజాగా మాట్లాడిన సమంత, తల్లి కావడం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన అనుభూతి అని చెప్పారు. ప్రతి మహిళ జీవితంలో మాతృత్వం ఎంతో కీలకమైన దశ. ఈ క్షణాన్ని అనుభవించాలని చాలా కాలంగా కలలు కన్నాను. ఇప్పుడు ఆ అందమైన ప్రయాణం మొదలవుతోంది. ఈ కొత్త బాధ్యత నాకు కొత్త శక్తిని, కొత్త ఆలోచనలను ఇచ్చింది. ప్రతి రోజూ కొత్త విషయాలను నేర్చుకుంటూ ఈ ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నాను అని తెలిపారు. తన సినీ ప్రయాణం గురించి కూడా సమంత స్పందించారు. ప్రతి పాత్రను ఎంతో బాధ్యతగా స్వీకరిస్తానని, ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా నటించేందుకు ఎప్పుడూ కృషి చేస్తానని చెప్పారు. నేను చేసే ప్రతి పాత్రను పూర్తిగా అర్థం చేసుకుని, దానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తాను. అభిమానులు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆదరణ నాకు ఎంతో విలువైనవి. వారి ఆశీస్సులు, అభిమానమే నా బలం. ఆ ప్రేమ ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను అని సమంత పేర్కొన్నారు. ప్రస్తుతం సమంత తన వ్యక్తిగత జీవితానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు కొంతకాలం సినిమాలకు విరామం ప్రకటించిన ఆమె, పూర్తిగా కుటుంబంతో గడపాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం' విజయంతో కెరీర్‌లో మరో సూపర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్న సమంత, ఇప్పుడు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆనందంగా ఆరంభిస్తున్నారు. ఆమె త్వరలో అందమైన బిడ్డకు జన్మనివ్వాలని అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలుపుతున్నారు.